ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 13 ఆగస్టు 2025



లాటరీ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో సీట్ల కేటాయింపు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతాపూర్ పబ్లిక్ స్కూల్‌లలో ఇంగ్లీష్ మీడియం 1వ తరగతిలో ప్రవేశాలకు లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ జరిగిన కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థులు ఇద్దరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. రాంపల్లి గ్రామానికి చెందిన కాదాసి సిసిర, మేడపల్లి గ్రామానికి చెందిన దొబ్బిల్ల అద్విత్ కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాధవితో పాటు అధికారులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం న్యాయవ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కల్గిస్తుందన్నారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహక రించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. దీనిపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. నిస్పక్షపాతంగా విచారణ చేయకుండా అసలు దోషులను కాపాడిందన్నారు. కుమారుడు, కోడలిని కోల్పోయిన ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయ చేయాల్సిన అప్పటి ప్రభుత్వ పెద్దలు విచారణను తప్పుదారి పట్టించి అసలు హంతకులను కాపాడారని అన్నారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ప్రజాసంఘాలు, కాంగ్రెస్ పార్టీ కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. న్యాయమే గెలుస్తుందన్నారు.



- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని భవనాలు
- ఎట్టకేలకు జిల్లాకు రూ. 2.06 కోట్లు మంజూరు
- ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన ప్రవేశాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిధుల కోసం సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లినా కూడా నిధులు మంజూరు కాలేదు. దీంతో ఇబ్బందులు పడుతూనే విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవనాల మరమ్మ తులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాలోని 12 జూనియర్ కళాశాలల భవనాల మరమ్మతులకు 2 కోట్ల 6 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ధర్మారం జూనియర్ కళాశాలకు 13 లక్షల రూపాయలు, రామగుండం బాలుర కళాశాలకు 8 లక్షల రూపాయలు, రామగుండం బాలికల జూనియర్ కళాశాలకు 59 లక్షల 50 వేల రూపాయలు, గోదావరిఖని జూనియర్ కళాశాలకు 16 లక్షల రూపాయలు, కాల్వశ్రీరాంపూర్ జూనియర్ కళాశాలకు 9 లక్షల 50 వేల రూపాయలు, ఓదెల జూనియర్ కళాశాలకు 12 లక్షల 50 వేల రూపాయలు, పెద్దపల్లి బాలుర కళాశాలకు 17 లక్షల రూపాయలు, మంథని బాలుర జూనియర్ కళాశాలకు 25 లక్షల రూపాయలు, మంథని బాలికల జూని యర్ కళాశాలకు 23 లక్షల రూపాయలు, కమాన్‌పూర్ జూనియర్ కళాశాలకు 9 లక్షల రూపాయలు, ముత్తారం జూనియర్ కళాశాలకు 9 లక్షల 50 వేల రూపాయలు, జూలపల్లి జూనియర్ కళాశాలకు 4 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి.

● విద్యార్థుల ఇబ్బందులు

నాలుగైదేళ్లగా జూనియర్ కళాశాలల భవనాలకు మరమ్మతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నిర్మించిన భవనాలు పాతబడుతున్నాయి. నాలుగైదేళ్లకోసారి అయినా భవనాలకు రంగులు వేయడం లేదు. విద్యుత్ వైరింగ్, స్విచ్చులు మార్పిడి చేయక వర్షాలకు గోడలు పదునెక్కి విద్యుత్ షాక్ వస్తున్నాయని చెబుతున్నారు. కిటికీలు ఊడిపోవడం, అక్కడక్కడ

(మిగతా 8వ పేజీలో)

కనీస వేతనాల జీవోను సవరించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్మిక వేతనాలు సవరించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాల పెంపుదలకు సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ కనీస వేతనాల సవరణకు సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి కార్మికులు శ్రమ దోపిడీకి గురువుతున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక చర్యను విడనాడి కనీస వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని తీసుకోవాలని, కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కనపెట్టి కేబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయా పనకు స్వస్తి చెపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యద ర్శులు జి జ్యోతి, సిపెల్లి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండి ఖాజా, నాయ కులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో మైనార్టీలకు ఉచిత శిక్షణ

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైనారిటీలు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి ఈ నెల 21 వరకు అవకాశం ఉందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ముస్లింలు, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధులు, జైనులు, పార్సికులు నాలుగు నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందులో గ్రూప్స్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఉంటుందని, అర్హతగలవారు దరఖాస్తు చేసుకొని జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు జతచేయాలని ఆయన తెలిపారు.

మండల స్థాయి టీఎల్ఎం మేళా

పాలకుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాధికారి తానం విమల అధ్యక్షతన మంగళవారం మండల స్థాయి(టీఎల్ఎం)మేళా నిర్వహించారు. వివిధ రకాల బోధన ఉపకరణాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధి అధికారి కలికోట రామ్మోహన చారి, ఎంపీవో ఉప్పు సుదర్శన్ , ప్రధానోపాధ్యాయులు జై కమలాకర్ రావు పాల్గొన్నారు.

● ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14న మండల స్థాయి బోధనోపకర ణాల మేళా నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి నరేంద్రచారి తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి

● ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. లక్ష్మీనర్సయ్య అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందిన విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ ప్రాముఖ్యత విద్యార్థులు నేర్చుకోవాల్సిన అదనపు సామర్థ్యాలు, ఉద్యోగ అవకాశాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పురుషోత్తం, షుకూర్, అధ్యాపకులు మురళి, శాలిని, శ్రీలతతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఆదేశాలు


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చే అవకాశాలున్నాయని, అధికారులు, అత్యవసర సిబ్బంది 24 గంటల పాటు అందు బాటులో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరద సహాయక చర్యలకు కలెక్టర్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడు దల చేస్తుందని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగుపాటుకు మరణించే పశువులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ వరదల నియంత్రణపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రిలీఫ్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అన్నారు. భారీ వర్షాలు వచ్చిన తర్వాత పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ కె శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు డివేణు, జే అరుణశ్రీ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పై సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, ఆసుపత్రి మరమ్మత్తులు, సబ్ సెంటర్ల నిర్మాణం పనులు పురోగతి వివరాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ తరపున మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పూర్తిచేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, సీపీఓ రవీందర్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం పాట

కోల్‌సిటీ, ఆగసు 12(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్టు రామగుండం తహసిల్దార్ ఈశ్వర్‌ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8న జనగామలో 450ట్రాక్టర్ల ఇసుక, ఎన్‌టీపీసీ టెలిఫోన్ భవన్ వెనుకాల 20ట్రాక్టర్లు, ఇందిరమ్మ కాలనీలో 25ట్రాక్టర్ల ఇసుకను పట్టుకున్నట్టు, ఈ ఇసుకను భూగర్భశాఖ ఆదేశాల మేరకు బుధవారం వేలపాట వేయనున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల ధరావత్ కట్టాలని, ఐటీ రిటర్న్ కాపీ సమర్పించాలని, వేలం దక్కని వారికి వేలం ముగిసిన అనంతరం ధరావత్ డబ్బులు వాపసు ఇస్తామన్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.560, సీనరేజ్ రూ.40, డీఎంఎఫ్‌టీ 30శాతం, ఎస్ఎంఈటీ సీజనరేజ్ ఫీజు 2శాతం నిర్ణయించినట్టు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా లక్ష్మణ్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా గోదావరిఖని జెడ్పీ బాలికల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు డీఈవో మాధవి ఉత్తర్వులు జారీ చేశారు.

పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో శ్రమదానం


శ్రమదానం చేస్తున్న పతంజలి యోగా సేవా సమితి సభ్యుల

ధర్మారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని పతంజలి యోగా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. మండల కేంద్రంలోని ఆయుష్ కేంద్రం పరిసర ప్రాంతంలో యోగ సభ్యులంతా శ్రమదానం చేసి పిచిమొక్కలను తొలగించారు. సామజిక బాధ్యతగా యోగా సభ్యులందరితో కలిసి శ్రమదానం చేసినట్లు యోగా గురు దంపంతులు జంగిలి సుధాకర్ - మంజులలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా అభ్యాసకులు నాడెం శ్రీనివాస్, దేవి అంజయ్య, సత్యనారాయణ, భూమన్న, రాజమౌళి, మేల్లష్, రమేష్, పోశెట్టి, రాజు, సమ్మయ్య వసంత ఉన్నారు.

నియోజకవర్గానికి సరిపడా యూరియా నిల్వలు

● రైతులు ఆందోళన చెందవద్దు ● ఎమ్మెల్యే చింతకుంట వియరమణరావు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్‌ను ఆయన భారీ వర్షంలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో యూరియా పుష్కలంగా ఉందని, నాలుగు రోజుల్లో మరో నాలుగు వేల టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. నాబార్డు నిధులు రూ.3.50 కోట్లతో మండలంలోని పాండవుల గుట్టపై నాలుగు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ వల్ల ఎంతో ఉపయోగమన్నారు. పెద్దపల్లి రైల్వే ట్రాక్ పక్కన గల ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి గోదాములకు ఇప్పిస్తానని ఎమ్మెల్యే అన్నారు. పెగడపల్లి నుండి గర్రెపల్లి వరకు 19 గ్రామాలను కలుపుతూ వంద కోట్లతో రహదారి నిర్మాణం చేయ నున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓదెల మల్లన్న దేవస్థానం నుంచి ఓదెల వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించి లైటింగ్ ఏర్పాటు చేసా _నని అన్నారు. అనంతరం పెగడపల్లి, ఆశన్నపల్లి, మడిపల్లి కాలనీల లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, డీసీఓ శ్రీమాల, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచం ద్రారెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, సీఈఓలు సత్యనారాయణరావు, కోలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి బహుజనులను ఏకం చేసి బీఎస్పీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి పెగ నరేష్ పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా సమీక్ష సమావేశం మంగళవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జి నరేష్ జిల్లాలో బీఎస్పీ పరిస్థితులను అసెంబ్లీ, సెక్టార్, బూత్ స్థాయి కమిటీల రిపోర్ట్‌ను పరిశీలించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, రామ గుండం అసెంబ్లీ ఇన్‌చార్జి జింక ఉదయ్, అసెంబ్లీ అధ్యక్షుడు జనగామ లింగయ్య, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, రామిల్ల శారద పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

సుల్తానాబాద్, ఆగస్టు 12: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగం వాటి దుష్ప్రభావం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో జిల్లా మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్టు సుచరిత, ఐసీపీఎస్ కౌన్సిలర్ శ్యామల, చైల్డ్ లైన్ కేర్ వర్కర్ కల్పన తదితరులు మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు పానీయాలకు, డ్రగ్స్‌కు అలవాటుకావద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు అన్యాయం చేసి వారి తప్పిదాలను, చేతగానితనాన్ని ప్రతిపక్ష పార్టీలపైకి నెట్టుతోందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న అన్యాయాలను ప్రజలందరికీ తెలియజెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్‌పై చిత్తశుద్ధితో లేదని, ఆర్డినెన్స్ ధర్నాలు అంటూ కాలం వెళ్లబుచ్చి, చివరకు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యాక బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామంటూ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. ఈ విధంగా బీసీలకు అన్యాయం చేసి వారి తప్పిదాలను, చేతగాని తనాన్ని ప్రతిపక్ష పార్టీల పైకి నెట్టివేసే క్రమంలో తప్పుడు ప్రచారాలను బీసీ బిడ్డల్లోకి పంపిస్తుందని, గ్లోబల్ ప్రచారాలు చేస్తుందని, వాటిని తిప్పి కొట్టాలని బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ బీసీ గర్జనకు పిలుపునిచ్చిందన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గంట రాములు యాదవ్, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, గుణపతి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, పెద్దపల్లి మండల పార్టీ అధ్యక్షులు మర్కు లక్ష్మణ్, పార్టీ నాయకులు పాల రామారావు, బైరెడ్డి రామిరెడ్డి, సందీప్ రావు, నిదానపురం దేవయ్య, అల్ల శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, మోహన్ రావు, కోయడ సతీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భూమి కబ్జా చేసి బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామలక్ష్మీ

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సలిగంటి రామలక్ష్మి పోలీస్ అధికారులను కోరారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణం కమాన్ ప్రాంతంలో తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణం చేపట్టగా కొందరు వ్యక్తులు కూల్చివేసి సామగ్రి ఎత్తుకెళ్లారని ఆరోపించారు. ఈ నెల 10న తమపై దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తులపై 100కి ఫోన్‌చేసి పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రామలక్ష్మి వాపోయారు. తనతో పాటు అనేక మంది భూములను వారు కబ్జాకు పాల్పడ్డారని, వారి నుండి రక్షణ కల్పించి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో లక్ష్మి, విజయ, కమల, లక్ష్మి, నూరుబీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సంఘాల్లో చేరాలి

జూలపల్లి, ఆగస్టు 12. (ఆంధ్రజ్యోతి) మహిళలు సంఘాల్లో చేరి అభివృద్ధి సాధించాలని వెలుగు దీప్తి మండల సమైక్య ఏపీఎం సధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు దీప్తి సమైక్య భవనంలో మంగళవారం ఇందిరమ్మ మహిళాశక్తి సంబరాలలో భాగంగా నూతన మహిళా సంఘాల ఏర్పాటుపై మండల మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని అన్నారు. సిసిలు మల్లేశం, శ్రీదర్, జ్యోతి, లక్ష్మి, వీవోఏలు పలువురు మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను మంగళవారం కోర్టు కానిస్టేబుల్స్ జీవన్, తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు తెలిపారు.

భార్య, అత్త వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో అత్త, భార్య సూటిపోటీ మాటలతో వేధించడంతో తట్టుకోలేక ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాలాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మహేందర్ (24) హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన ప్రవళికను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఈ నెల 1న పాప జన్మించింది. వివాహం జరిగినప్పటి నుంచి వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవళిక, అత్త ఎల్లమ్మ మహేందర్‌ను ఇష్టానుసారంగా దూషించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మహేందర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జమ్మికుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువులో ప్రమాదవశాత్తు పడి మహమ్మద్ జబ్బర్ (64) అనే మతిస్థిమితం లేని వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ నెల 12న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లిన జబ్బర్ ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యు లు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసిన ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

చోరీకి యత్నం

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పిప్పరి పురుషోత్తం ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పురుషోత్తం వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లాడు. కాగా ఇది గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు, పురుషోత్తంకు సమాచారం అందించారు. పోలీసులు, పురుషోత్తం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ పోలేవని గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హన్మాజీపేట గ్రామంలోని గుట్ట

గుట్ట కోసం ఏకమయ్యారు..

- పర్యావరణ పరిరక్షణకు హన్మాజీపేట గ్రామస్థుల ప్రయత్నం
- మొరం టెండర్ రద్దు చేయాలని ఆందోళన

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని గుట్టను కాపాడడం కోసం ఊరంతా ఏకమయ్యారు. హన్మాజీపేట గ్రామంలోని సర్వేనంబర్ 596లో గల గుట్ట మొరం తరలించేందుకు ప్రభుత్వం టెండర్ పిలిచినట్లు గ్రామస్థులకు తెలిసింది. గుట్ట నుంచి మొరం తరలించడం ద్వారా పర్యావరణం దెబ్బతిని గ్రామం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హన్మాజీపేట వాసులు ఆందోళన చెందుతున్నారు. గుట్టను కనుమరుగు చేసేవిధంగా జారీ అయిన టెండర్లను రద్దు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని, పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుట్ట మొరం తరలింపుతో జరిగే నష్టాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

గుట్టపై పురాతన ఆలయాలు

ప్రకృతి రమణీయతకు నెలువైన గుట్టపై తాము దైవంగా భావించే అతి ప్రాచీన రామాలయం, అంజనేయస్వామి, పెద్దమ్మతల్లి వంటి ఆలయాలు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గుట్ట మట్టిని తరలిస్తే కోల్పోతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతనమైన హన్మాజీపేట గుట్ట పశువులకు, జంతువులకు, ఇతర జీవరాశులకు జీవానాధారంగా ఉందన్నారు.

దీంతో గుట్ట నుంచి మొరం తరలించే టెండర్ ప్రక్రియను ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్ ప్రక్రియను రద్దు చేయకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హన్మాజీపేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

టెండర్ రద్దు చేయాలి

గొడుగు సురేష్, హన్మాజీపేట



పురాతనమైన గుట్ట పశువులకు, జంతువులకు, ఇతరజీవరాశులకు జీవనాధారంగా ఉంది. గుట్టపైన తాము ఆరాధ్యదైవంగా భావించే పురాతనమైన పెద్దమ్మతల్లి, రామాలయం, ఆంజనేయ ఆలయాలు ఉన్నాయి. గుట్టనుండి మొరం తరలిస్తే పర్యావరణం దెబ్బతిని హన్మాజీపేట, కండ్లపల్లి, పొరండ్ల, బాలపల్లి గ్రామాలు కాలుష్యం అవుతాయి. గుట్ట మొరం తరలించే టెండర్‌ను రద్దు చేయాలి.

గుట్టను కాపాడాలి

గాలిపెల్లి శ్రీధర్, హన్మాజీపేట



హన్మాజీపేటలోని గుట్టనుండి మొరం తరలించేందుకు టెండర్ పిలుస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. మూడు గ్రామాలకు నెలువైన గుట్ట నుంచి మొరం తరలిస్తే చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు చాలా నష్టపోతారు. వెంటనే మొరం తరలించే టెండర్‌ను రద్దు చేసి గుట్టను కాపాడాలి. టెండర్ రద్దు చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం.



మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హన్మాజీపేట గ్రామస్థులు(ఫైల్)

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ వెంకటస్వామి

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి సూచించారు. మానకొండూర్‌లో మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తూర్పు దర్వాజ బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. యువత వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి, మంచిపేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో యువత గస్తీలుగా తిరగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల పోస్టర్‌ను గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలోని వీధుల గుండా పోలీసులు తిరిగి కాగితాలు, నంబర్ ప్లేట్ లేని 69 వాహనాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ సంజీవ్, తిమ్మాపూర్, కొత్తపల్లి, సీఐలు సదన్‌కుమార్, కోటేశ్వర్, పుల్లయ్య, ఎస్ఐ స్వాతి, పోలీసులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకటస్వామి

కాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాకతీయ ఉపకాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లికి చెందిన ఎ సంపత్ అనే వ్యక్తి మండలంలోని అన్నారం గ్రామంలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్నాడు.

కాగా పోచంపల్లి గ్రామ శివారుకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కాకతీయ ఉపకాల్వలో పడ్డాడు. సదరు వ్యక్తి అరుపులు విన్న బాటసారులు గమనించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. తీవ్రగాయాలైన సంపత్‌ను 108 వాహనంపై కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీసా కోసం డబ్బులు వెచ్చించి మోసపోయిన యువతి

- మనస్తాపంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలు వెళ్లడానికి వీసాల కోసం ఖర్చులుపెట్టి ఆర్థికంగా నష్టపోయిన జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన నల్లమోతు హర్షిత (25) అనే యువతి పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం అంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నల్లమోతు హర్షిత కుటుంబసభ్యులు 25 ఏళ్ల క్రితం జగిత్యాల మండలం హస్నాబాద్‌కు వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఇటీవలే డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా యూనివర్సిటీల కోసం తెలిసిన వ్యక్తుల ద్వారా ప్రయత్నించింది. అమెరికాలోని తప్పుడు యూనివర్సిటీని ఎంచుకొని మోసపోయింది. తద్వారా వీసాల కోసం సుమారు 10 లక్షల రూపాయల వరకు డబ్బులను వెచ్చించి ఆర్థికంగా నష్టపోయింది. చివరి ప్రయత్నంలో భాగంగా జర్మనీ దేశానికి వెళ్తానని ఇంట్లో తండ్రికి చెప్పడంతో తండ్రి శ్రీనివాస్ ఇప్పటికే చాలా డబ్బులు ఖర్చుచేశావని వద్దని వారించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి తాను విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కల నేరవేరదని భావించిన హర్షిత ఈనెల 6 వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం హర్షిత మృతి చెందింది. మృతురాలు హర్షిత తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.



హర్షిత (ఫైల్)

మోర్ సూపర్‌మార్కెట్‌లో.. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమాన్ ప్రాంతంలోని మోర్ సూపర్‌మార్కెట్‌లో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఫేడ్ ఐటమ్స్‌ను విక్రయిస్తున్నారనే సమాచారంతో మోర్ సూపర్‌మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి తెలిపారు. నూడుల్స్, చిక్కి ప్యాకెట్లు, ధనియాల ప్యాకెట్లు గడువు ముగిసినప్పటికీ విక్రయిస్తున్నట్లు గుర్తించి డస్ట్‌బిన్‌లో పారేశామని తెలిపారు. చాలారకాల ఫైడ్ ఐటమ్స్ రెండు నుంచి ఏడు రోజుల వ్యవధిలో గడువు ముగుస్తున్నట్లు గుర్తించామని, వీటన్నిటినీ తొలగించాలని ఆదేశించామని అన్నారు. మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన మహేష్ అలియాస్ నాయక్ మల్లేష్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గడ్డం బువన్‌కు శిక్ష విధించారు. జల్సాలకు అలవాటుపడి వీరిద్దరూ అక్రమార్జన కోసం 2021 ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి కారులో 30లక్షల రూపాయల విలువచేసే 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి తీసుకోస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం సమీపంలోని వి వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో కారును వేగంగా నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా ఢీకొట్టారు. ఆటో, కారు బోల్తాపడ్డాయి. ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారును పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకోగా, మరో నిందితుడు ఇషాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి కె ఉమాదేవి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన



యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తన ఇంటి ఎదుట వరద నీరు ఆగి బురదమయం అవుతోందని, రోడ్డు మరమ్మతు చేసే వరకు ఎవరినీ వెళ్లనీయనని రోడ్డుకు అడ్డంగా చెట్ల మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు వెదిర శ్రీకాంత్ అనే యువకుడు. మండల కేంద్రం నుంచి పారువెళ్లకు వెళ్లే దారిలో ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షానికే తన ఇంటి ఎదుట వరదనీరు చేరి కుంటను తలపించే విధంగా ఉంటుందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వెదిర శ్రీకాంత్ అనే యువకుడు రోడ్డుకు అడ్డంగా మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు. రోడ్డుపై వాహనాలు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి యువకుడికి నచ్చచెప్పే ప్రయత్నం చేయగా వాగ్వాదానికి దిగాడు. దీంతో కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని యువకుడిని సముదాయించి రోడ్డుపైన పెట్టిన మొద్దులను తొలగించారు.

గొల్లపల్లిలో చోరీ.. బంగారం, నగదు అపహరణ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి సమ్మయ్య నెల రోజుల నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని భావించిన నిందితులు ఇంట్లోకి చొరబడి 18 తులాల వెండితో పాటు మూడు తులాల బంగారం, ఎనిమిది వేల నగదును అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి తాళాలు సైతం పగలగొట్టి ఎత్తుకొని వెళ్లారని, పక్కింటి వారు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి చూశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్ పోలీసులు చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో దొంగతనం

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయ గేటును లేపి లోనికి ప్రవేశించారు. కార్యాలయ తలుపుల తాళాలను పగులకొట్టి అందులోని విద్యుత్ మోటార్లు, బోరులకు సంబంధించిన పరికరాలు, ఇనుప సామాను ఎత్తుకెళ్లారు. మంగళవారం గ్రామపంచాయతీ సిబ్బంది కార్యాలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి అధికారులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా స్థానిక సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు, సీసీ పుటేజిని పరిశీలించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- సర్వే రిపోర్టు కోసం ఫోన్ పే ద్వారా లంచం



ఏసీబీకి చిక్కిన సునీల్, రాజేందర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ఫోన్ పే అవినీతి చేపను ఏసీబీ అధికారులకు పట్టించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఓ రైతు ఎనిమిది నెలల క్రితం తన భూమి సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేసి రిపోర్టు ఇవ్వడంలో సర్వేయర్ పెండ్యాల సునీల్ డబ్బులు డిమాండ్ చేశాడు. తన ప్రైవేట్ సర్వేయర్ కె రాజేందర్‌రెడ్డి ద్వారా మంతనాలు జరిపారు. 20 వేల రూపాయల డిమాండ్ చేయగా పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రైతు జూలై 2న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు చెప్పిన ప్రకారం నగదు ఇచ్చేందుకు చేసే ప్రయత్నం విఫలం కావడంతో ఫోన్‌పే ద్వారా రాజేందర్‌రెడ్డికి డబ్బులు పంపించమని సర్వేయర్ సునీల్ చెప్పాడు. దీంతో రాజేందర్‌రెడ్డికి జూలై 9న రైతు 10 వేలు ఫోన్ పే చేసిన వెంటనే రాజేందర్‌రెడ్డి సునీల్‌కు ఫోన్‌పే చేశాడు. ఏసీబీ అధికారులు శాంతినగర్‌లో భూమి సర్వే చేస్తుండగా సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రిజిస్టర్ కేస్ ఆఫ్ అదర్(ఆర్‌సీవో) కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో ఏసీపీ సమావేశం

వీణవంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం సమావేశం నిర్వహించారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు 34 రోజులుగా కొండపాక గ్రామంలోని మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీలపై పరదలు కట్టుట కోసం రిలే నిరహర దీక్షలు చేస్తున్నారు. ఏసీపీ మాధవి రెండు గ్రామాల నాయకులను పెద్దలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కొండపాక గ్రామస్థులు పరదలు కట్టుట నిలిపివేయాలని కోరారు. స్థానిక ఎన్నికల అనంతరం సమస్యకు పరిష్కారం చూపెడుతామని ఇరుగ్రామాల ప్రజలు తొందరపడవద్దన్నారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు ధర్నాలు, దీక్షలు, రాస్తారోకో చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రేపు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

సుల్తానాబాద్, ఆగస్టు 12: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 14న వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న ద్విచక్ర వాహనాలను, ఆటోలను 14న గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా మధ్యనిషేధ, ఎక్సైజ్ అధికారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సకాలంలో వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి మించి మరొకరు..

- ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అంటూ అధికారులు ఊదరకొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే అందుకు విరుద్ధంగా ఉంటోంది. తాజాగా హుజూరాబాద్ డిపోనకు చెందిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు చేసిన ప్రమాదకర డ్రైవింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం కలకలం రేపుతోంది. జమ్మికుంట బస్‌స్టేషన్ నుంచి హుజూరాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులు హుజూరాబాద్ వైపునకు ఒకే సమయంలో బయల్దేరాయి. ఆర్టీసీ డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు ప్రమాదకరంగా ఇతర వాహనాలు వెళ్లకుండా ఓవర్ టేక్ చేస్తూ బస్సులను నడిపారు. దీంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. వేరే వాహనాలు వెళ్లకుండా ప్రమాదకరంగా ఆర్టీసీ బస్సులను నడుపుతుండగా వెనుకవస్తున్న వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్‌గా మారింది.



పక్కపక్కనే ప్రమాదకరంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు

కుక్కల దాడిలో.. మనుబోతుకు గాయాలు

కొడిమ్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం రేసు కుక్కల దాడిలో మనుబోతుకు గాయాలయ్యాయి. మనుబోతు కోనాపూర్ గ్రామంలోకి రాగా గ్రామస్థులు రక్షించి అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో బీట్ అధికారి ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యుడు మహేందర్ మనుబోతును మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో వైద్యాధికారి రాకేష్‌తో చికిత్స చేయించారు. అనంతరం మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.



గాయపడి గ్రామంలోకి వచ్చిన మనుబోతు

మూడు రోజులైనా అదుపులోకి రాని మంటలు

- రూ.1.67కోట్ల విలువైన ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగ్గా మంగళవారం కూడా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదంలో రూ.1.67కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్‌సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మెట్‌పల్లి, జగిత్యాల అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలను రప్పించారు. దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం చుట్టూ గోడలను బద్దలుకొట్టి అందులోంచి కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. గోదాంలో గోనె సంచుల కింద కట్టెలు వేసి ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో మార్కెట్ గోదాం పూర్తిగా దెబ్బతిన్నదని అధికారులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంపై సివిల్ సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ అధికారులు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

గోదాంలో సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన వాడిన సంచులు 2018 సంవత్సరం నుంచి నిల్వ చేస్తున్నారు. గోదాం కిరాయి ప్రతి నెల మార్కెట్ కమిటీకి 38వేల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదాంలో నిల్వచేసిన సంచులకు ప్రతి సంవత్సరం టెండర్ వేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఏడు సంవత్సరాల నుంచి గోనె సంచులను గోదాంలో నిల్వ చేస్తున్నారు. దీంతో అగ్నిప్రమాదంలో గోదాంలో ఉన్న గోనె సంచులన్నీ కాలిపోగా వాటికి ఇన్సూరెన్స్ ఉందని అధికారులు తెలిపారు. డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, తహసీల్దార్ నీత, ఆర్ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్‌లు అక్కడే ఉండి ఫైర్ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నారు.



మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంను పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మార్కెట్ యార్డులోని గోదాంలో మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫైర్ సిబ్బందికి సూచించారు. ప్రమాదం జరిగిన గోదాంను ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రమాదాన్ని నివారణకు చేపట్టిన చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన సంచులను వెంటనే ఇతర ప్రదేశానికి తరలించాలని, మంటలు ఇతర గోదాంలతో పాటు చుట్టున్న ఇళ్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ నీత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ప్రమాద కారణాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రాష్ట్రపతిని కలిసిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు





అంతర్గాం కస్తూర్బా విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించిన విద్యార్థి సహస్ర

అంతర్గాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌లో రెండోస్థానం పొందిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు ఈ నెల 9న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిశారు. కస్తూర్బా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీక్ష షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. షార్ట్‌ఫిల్మ్‌ను చూసిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విద్యార్థులను తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. ఉపాధ్యాయురాలు లత, స్కూల్ కెప్టెన్ ఎలిగేటి సహస్ర ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిశారు. తెలంగాణ నుంచి తమకు అవకాశం వచ్చిందని వారు పేర్కొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల పెంపునకు 'ఉన్నతి'



మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి మంగళవారం ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని, సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కరీంనగర్ జోన్ బాధ్యులు ప్రవీణ్ కుమార్, సామ్యూల్ మాట్లాడుతూ నెల రోజులు కొనసాగే ఉన్నతి తరగతులను సద్వినియోగం చేసుకొని డిగ్రీ కాగానే ఉద్యోగం సంపాదించుకోవాలన్నారు. టీఎస్‌కేఈసీ కోఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ బూర్ల నరేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఆసుపత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీపై సిబ్బందికి వివరిస్తున్న బృందం

హుజూరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు అందుతున్న సేవలపై ఆస్పత్రి సిబ్బందితో చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ నిర్వహించి, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, రోగులకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..



నేడు ఎడమచేతి వాటం దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'కుడి ఎడమైతే పొరపాటులేదోయ్' అని అన్నాడు ఓ సినీ కవి. నిత్య జీవితంలో పనులకు అందరూ కుడి చేతిని వినియోగిస్తే కొందరు ఎడమచేతితో అవలీలగా చేస్తూ ఆకర్షిస్తారు. కుడి చేతి వారితో సమానంగా చేయగలుగుతారు. ఎడమచేతితో పనులు చేయడం అలవాటో, పొరపాటో తెలియదు గానీ ఓ విలక్షణత మాత్రం వారిలో కనిపిస్తుంది. ఈ అలవాటుకు ఓ ప్రత్యేక రోజు ఉంది. ఆగస్టు 13న అంతర్జాతీయ ఎడమచేతివాటం దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలిసారి 1976 ఆగస్టు 13న నిర్వహించారు. ఎడమచేతివాటం వారు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపైనా, ఇతర సమస్యలపైనా అవగాహన కల్పించడం, వాటిని అధిగమించడానికి ఎడమచేతివాటం వారిని ప్రోత్సాహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. పోలియో, ప్రమాదాల బారిన పడిన వారు, ఎడమచేతివాటం ఉన్నవారు అన్నిరంగాల్లో రాణిస్తారని, మరికొందరు కాస్త మందకొడిగా ఉంటారని చెబుతున్నారు. ఎడమచేతివాటం ఉన్నవారు ఎక్కువ శాతం క్రీడలు, కళారంగాల్లో రాణిస్తారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు కార్యాలయాల్లో చాలామంది ఎడమచేతితో పనులు చేయడం, రాయడం చూస్తుంటాం. ఎడమచేతివాటంతో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

చిన్నప్పటి నుంచి అలవాటు : జి.ఉజ్వల, హిందీ ఉపాధ్యాయిని, సిద్ధార్థ స్కూల్



నాకు చిన్నప్పటి నుంచి ఎడమచేతితో రాయడం అలవాటు. ఇబ్బంది లేకుండా రాస్తాను. మా బాబు రచిత్ (4వ), పాప రక్షిక (యూకెజి) కూడా ఎడమ చేతితోనే రాస్తారు.

ఎడమ చేతివాటంతో ప్రత్యేక గుర్తింపు

పి.అభినందన్, 9వ, బ్లూబెల్స్ స్కూల్



ఎడమచేతితో రాయడంతో నాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎడమచేతితో గుండ్రంగా, అందంగా రాయగలను. చిన్నప్పటి అలవాటు స్థిరమైపోయింది. ఎడమచేతితో రాస్తేనే రాసినట్లుగా అనిపిస్తుంది.

చల్లంగా చూడు పోచమ్మ తల్లీ..



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి (ఆగస్టు 12) : పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిరిని దర్శించుకున్న భక్తులు మంగళవారం ఉదయం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని శివసత్తుల ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలు, సంకన పిల్లలతో గంటల తరబడి ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 5 లక్షల విరాళం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ముస్కు కార్తీక్ రెడ్డి- సుష్మ దంపతులు, వారి పిల్లలు ఆరుష్, కియాన్‌లు రాజరాజేశ్వర స్వామి పేరుతో విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవో రాధాబాయికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అశోక్‌కుమార్, ఉద్యోగులు శ్రీనివాస్ శర్మ, బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో శత వారం సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు మోటూరు మధుసూదన్ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హిందు ఉత్సవ కమిటీ సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసంకు తోడు మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. అంజన్న దర్శనంకు కొండగట్టుకు వచ్చిన తాటిపల్లికి చెందిన రోషిని భక్తురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అది స్వీపర్ లక్ష్మికి దొరకడంతో అవుట్ పోస్టు పోలీసులకు అప్పగించింది. దీంతో విచారణ జరిపి ఏఎస్సై చిలుక శ్రీనివాస్ భక్తురాలికి సెల్‌ఫోన్ అప్పగించారు.

ధర్మపురిలో సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి: సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ గణ పతి ఆలయంలో మంగళవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



ధర్మపురిలో విశేషాలంకరణలో గణపతి స్వామివారు





బోనాలతో మహిళలు, కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



రేషవేణి మహేష్

ధర్మారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని ధర్మారం మండల యువకుడికి ఆహ్వానం అందింది. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన రేషవేణి మహేష్ యువశక్తి యూత్ స్థాపించి కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రాలు దేశంలోని వంద మందిని భారత్ వలంటీర్లుగా ఎంపిక చేసింది. ఎంపికైన వంద మందిలో ధర్మారం మండలానికి చెందిన మహేష్ ఉన్నారు. గతంలోనూ ఢిల్లీలో నిర్వహించిన మేరీ మాటి, మేరీ దేశ్ కార్యక్రమాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మహేష్ ప్రాతినిధ్యం వహించారు. ఈ అవకాశం కల్పించినందుకు అధికారులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రేషవేని మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 5,658 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 5,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథ కానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరిఅవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 39.254 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.104 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వారంలోగా దళితుల..

భూసమస్యను పరిష్కరించాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గోపాల్‌పూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వారం లోగా దళితుల భూ సమస్యను పరిష్కరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని గోపాల్‌పూర్, తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్ల గ్రామాల సరిహద్దులో ఒక రైతుకు, దళితులకు మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఏడీ ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం గోపాల్‌పూర్, జూగుండ్లలో పర్యటించి వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దళితులు కొంపెల్లి మల్లయ్య, వీరయ్య, నర్సయ్య, ఎల్లయ్యతో పాటు జూగుండ్ల గ్రామానికి చెందిన శ్రీగిరి కనుకయ్యకు చెందిన సర్వేనంబర్ 178లో సుమారు ఎనిమిదేకరాల వ్యవసాయ భూమిపై ఏళ్ల తరబడి వివాదం నెలకొంది. ఈభూమి రికార్డుల్లో దళితుల పేరున ఉన్నప్పటికీ మోఖాపై లేదని, తమ భూమి ఆక్రమణకు గురైందని దళితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు, ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. సమస్యను పరిశీలించేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాలకు కదిలివచ్చారు. అధికారుల ముందు భూమి మాదంటే మాదని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో భూసమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిల్లా అధికార యంత్రాంగాన్ని తీసుక విచ్చినట్లు వివరించారు. ఇరు గ్రామాల భూమి రికార్డు మ్యాపులను అధికారులు పరిశీలించారన్నారు. భూమి కొలతలు, హద్దులు తేల్చాలని వారం లోగా భూసర్వేను చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇరువర్గాలు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు జక్కని నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు



- కేరాఫ్ వివరాలు తొలగింపు
- తండ్రి, భర్త పేర్లు ఇకపై ఉండవు


ఐదేళ్లు దాటిన చిన్నారులకు అప్‌డేట్ తప్పనిసరి

చొప్పదండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లేకుంటే ప్రస్తుతం ఏ పని జరగడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధార్‌కార్డు వివరాల్లో సైతం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారు. తాజాగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్‌కార్డులో కొన్ని మార్పులు చేసింది. ఇక నుంచి ఆధార్ కార్డులపై కేరాఫ్ స్థానా న్ని తొలగించింది.

తండ్రి, భర్త పేర్లు లేకుండానే వ్యక్తి పేరు, చిరునామాతో నూతన విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో తండ్రి, భర్త పేర్లతో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో కేరాఫ్ ఏర్పాటు చేసింది. ఈ విధానంలోనూ ఇబ్బందులు తప్పడం లేదని సంస్థ గుర్తించింది. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించినట్లు యూ ఐడీఏఐ ప్రకటించింది. ఇక నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకున్న వ్యక్తులకు, వివాహం జరిగిన మహిళలకు భర్త పేరు లేకుం డానే చిరునామా మార్పులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌లో చిరునామా మార్చుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో బయో మెట్రిక్ విధానం ఉండదని, ఐదేళ్ల దాటితే వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ నమోదు చేయించాలని యూఐడీఏఐ సూచించింది. ఏడేళ్లు దాటినా బయోమెట్రిక్ ఇవ్వకపోతే ఆధార్ కార్డులు డియాక్టివేట్ అవుతాయని యూఐడీ ఏఐ తెలి పింది. ఏడేళ్లలోపు అప్‌డేట్ చేసుకున్న వారు పది హేనేళ్లకు మరోసారి అప్‌డేట్ చేసు కోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గంగాధరలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఇల్లంతకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాస మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక కుంకమపూజల అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగ రాజుశర్మతో పాటు మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్



ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్

గణేశ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యమని, దేశవ్యాప్తంగా విద్యార్థులకు అండగా నిలిచిన ఏకైక విద్యార్థి సంఘమని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం గీతభవన్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొట్ట మొదటగా ఏర్పడిన ఏకైక విద్యార్థి సంఘమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది బలిదానాలు చేసిన గొప్ప చరిత్ర ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండి పడ్డారు. బడ్జెట్ కేటాయింపు ల్లో విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్ట అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్, హేమంత్ మాజీ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపెల్లి రాజు, బోనగిరి మహేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, నగర నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు

కోరుట్ల, ఆగస్టు 12 : శ్రావణ మంగళవారం పురస్కరించుకొని పట్టణంలోని కోటి నవదుర్గ దేవలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు సాగాయి. పద్మశాలికులోన్నతి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో మార్కండేయ మందిరం, కోటి నవదుర్గ దేవలయంలో మంగళగౌరి వత్రాలు వేద పండితులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ, సంతోష్ శర్మ, షాకేత్‌శర్మల మంత్రోచ్చరణ మధ్య సాగింది. మహిళలు విష్ణుశాస్త్ర నామపారాయణం జరిపారు.



ఖని ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల సంబరాలు

● ఒకే రోజు రూ.63లక్షల ఆదాయం



కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డిపో మేనేజర్ నాగభూషణం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపోకు రూ.63.25లక్షల ఆదాయం వచ్చిందని, ఇది తెలంగాణలోనే చరిత్ర అని గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం గోదావరిఖని డిపోలో ఉద్యోగులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఉద్యోగులు, అధికారుల సమిష్టి కృషితోనే గోదావరిఖని డిపోకు రూ.63.25లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్ ఇవ్వాలని నిరసన

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన కార్మికులకు ఆర్‌పీఎస్ ఏరియర్స్‌తో పాటు బెనిఫిట్స్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు నిరసనకు దిగారు. అనంతరం డిపో మేనేజర్ నాగభూష ణంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, కనకయ్య, శ్రీనివాస్, శంకర్, ఐలయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు

జ్యోతినగర్, ఆ గస్టు 12 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ పద్ధతిలో విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు వస్తాయని జిల్లా విద్యాధి కారి డి.మాధవి అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీ పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్-టిఎల్ఎం మేళా కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మంగళ, బుధ వారాల్లో 14 మండలాలలో మండలస్థాయి టీఎల్ఎం మేళాలు నిర్వహించి 20 పాఠశాలలను జిల్లాస్థాయి మేళాకు ఎంపిక చేస్తామని డీఈవో మాధవి తెలిపారు. ఎంఈవో జింక మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన మేళాలో డిఆర్‌పి రవిందర్‌రెడ్డి, హెచ్ఎంలు జయరాజు, భవాని, శారద, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్యులు దీక్షిత్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు.

అందుబాటులో యూరియా

ముత్తారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ముత్తారం మండలంలో ప్రైవేటు ఫర్టిలైజర్ డీలర్లవద్ద, ప్రాథమిక సహకార సంఘం, ఆగ్రోస్‌లలో 1500వందల వరకు యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. అవసరం ఉన్నవారు మత్రమే కొనుగోలు చేయాలన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

ముత్తారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జూన్ 5 వరకు పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు, ఇప్పటివరకు రైతుబీమా చేసుకోని రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు ఏఈఓకి రైతువేదికలో ఇవ్వాలని తెలిపారు.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన

మంథనిరూరల్, 12 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం డ్రీమ్ స్టార్ట్ రైజ్ సంస్థ ప్రతినిధులు త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇండస్ట్రియల్ సెక్టార్‌పై అవగాహన కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



సింగిల్ విండో కార్యాలయం వద్ద రైతుల క్యూలైను

మంథని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో యూరియా బస్తాల కోసం కోసం బారులు తీరారు. గంటల తరబడి లైన్ ఉండి యూరియా బస్తాలు కొనుగోలు చేశారు. యూరియా విక్రయాలపై ఫెర్టిలైజర్ షాపుల షరతులు లేకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖనిలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం నితిలేష్, ఎల్కపల్లి సురేష్, మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగొప్పుల సాయిఅనుప్, కట్ల అభినయ్, రౌతు విదిష పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్ ఎదుట రైతుల ధర్నా

రామగిరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామంలోని కేడీసీసీ బ్యాంక్‌లో క్రాప్ రుణాలు పొంది మాఫీకి నోచుకోని రైతులు బ్యాంక్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. గత సంవత్సరంలో రుణాలు మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. అందులో నాగెపల్లి కెడిసిసి బ్యాంక్ పరిధిలో 54 మంది రైతులు క్రాప్ రుణాలు పొంది ఉన్నారు. ప్రభుత్వం మాఫీ జాబితాల్లో తమ పేర్లు వస్తాయనే నమ్మకంతో ఉన్నా రైతులకు చుక్కెదురైంది. దీంతో నాగేపల్లి కెడిసిసి బ్యాంక్ ఎదుట మంగళవారం ధర్నా దిగారు. కార్యక్రమంలో బిజెపి నాయకుడు మోల్నామూరి శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణలో వాస్తవాలు వెలుగు చూస్తాయి

మంథని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గట్టు వామన్‌రావు దంపతుల హత్య కేసును సీబీఐ విచారిస్తే వాస్తవాలు వెలుగు చేసే అవకాశం ఉందని మంథనికి చెందిన న్యాయవాది శశిభూషణ్ కాచే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. విచారణలో సీబీఐ కుట్రదారులను బయటకు తీసి న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించి, బాధిత కుటుంబానికి సరైన న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ

మంథని, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మంథనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే విద్యార్థులు ప్రతిభను చాటినట్లు మాస్టర్ కావేటి సమ్మయ్య మంగళవారం తెలిపారు. ఢిల్లీలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులు తైబా సిల్వర్ మెడల్, పోగుల శివసాకేత్, కొండ రిషి, బండారి మణికంఠలు బ్రౌంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. వీరిని కరాటే ఇండియా అధ్యక్షుడు భరత్ శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పాపయ్యలు అభినందించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

మంథని: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బోధన అభ్యాసన పరికరాల ప్రదర్శన ఆకట్టుకుంది. మేళాను ఏఎంసీ, సింగిల్‌విండో ఛైర్మన్లు వెంకన్న, కొత్త శ్రీనివాస్ ప్రారంభించారు.

ఆదర్శ నగరంగా రామగుండం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



ఎక్స్‌వేటర్‌తో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రామగుండంను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం స్థానిక ఖాజిపల్లిలో 50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 100 రోజుల ప్రణాళిక ద్వారా నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

కోల్‌సిటీ: సప్తగిరికాలనీలో రూ.12లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, యూజీడీ పనులకు కమిషనర్ అరుణశ్రీతో కలిసి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత రామగుండం నగరాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నట్టు, నగరంలో అన్ని కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు, మంచినీరు, వీధి దీపాల సౌకర్యాలను కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, మహంకాళిస్వామి, గడ్డం శ్రీనివాస్, కొలిపాక సుజాత, పెద్దెల్లి ప్రకాష్, కొలని కవిత, కార్పొరేషన్ అధికారులు రామన్, జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

లారీ యజమానుల సంక్షేమం కోసం కృషి

కళ్యాణ్‌నగర్ : రామగుండం లారీ యజమానులకు అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం గోదావరిఖని గంగానగర్‌లో లారీయార్డులో జరిగిన యజమానుల సంక్షేమ సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మృతి చెందిన కుటుంబాలకు సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా స్థానిక లారీ యజమానులకు ఇప్పించే విధంగా యాజమాన్యంతో చర్చలు జరిపినట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి బొగ్గు రవాణాకు మార్గం సుగమం చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి పాల్గొన్నారు.

గోదావరిఖనిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

కోల్‌సిటీ: గోదావరిఖని ఇందిరానగర్ చౌరస్తా నుంచి గౌతమినగర్ చౌరస్తా వరకు రూ.45లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంగళవారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, డీఈ ఖాజా, జమీల్ అహ్మద్, ఏఈలు మీర్, చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

దర్వాజలు, తలుపులు దెబ్బతిన్నాయి. ఓదెలలో బోరింగ్ మోటార్ రిపేరింగ్‌తో పాటు బోర్‌వెల్ కూడా పనిచేయడం లేదు.

● కళాశాలల్లో పెరిగిన ప్రవేశాలు

జిల్లాలో గల 14 జూనియర్ కళాశాలల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 2,134 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ కోర్సులతో పాటు వృత్తి విద్య కోర్సుల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందారు. గత ఏడాది 2,034 మంది ప్రవేశాలు పొందగా, ఈ ఏడాది గత ఏడాదికంటే 100 మంది అదనంగా ప్రవేశాలు పొందారు. కళాశాలల ఆరంభానికి ముందుకు వేసవిలో అధ్యాపకులు ప్రవేశాల కోసం ముమ్మరంగా ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో చేరడం వల్ల ఉచిత విద్య అందించడంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందుతాయని, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్య అందిస్తారని ప్రచారం చేశారు. అలాగే ఎప్‌సెట్, జేఈఈ పరీక్ష లకు శిక్షణ ఇస్తామని, మెటీరియల్ కూడా అందిస్తున్నామని అధ్యాపకులు ముందస్తుగా చేసిన ప్రచారం అనుకూలించడంతో 100 మంది అదనంగా చేరారు. ఇంకా ప్రవేశాలు పొందేందుకు ఈ నెలాఖరు వరకు కూడా అవకాశం ఉందని ఇంటర్‌మీడియెట్ నోడల్ అధికారి కల్పన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ముత్తారం మండలంలో దర్యాపూర్ శివారులోని మోడల్ స్కూల్‌లో ఇంగ్లీష్ బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సంతోష్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు పాఠశాలలో అందజేయాలని తెలిపారు.

ఇసుక వేలంతో రూ.3.26 లక్షల ఆదాయం

కోల్‌సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్ మండల పరిధిలో ఈ నెల 5న ఇసుక డంప్‌లు సీజ్ చేసి వేలం వేశారు. గోదావరిఖని సప్తగిరికాలనీ, జనగామ, ఎఫ్‌సీఐ శాంతినగర్‌లో 180 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. క్యూబిక్ మీటర్‌కు రూ.560 చొప్పున ప్రారంభ ధరతో ఈ వేలం వేశారు. క్యూబిక్ మీటర్‌కు రూ.605చొప్పున ట్రాక్టర్‌కు రూ.1815ధర పాటపాడారు. వేలం దక్కించుకున్న వారు రూ.3.26లక్షలు చెల్లించారు. ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు డంప్‌ల వద్దే రూ.1815ధర పలుకడం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ట్రాక్టర్ యజమానుల్లోచర్చనీయాంశమైంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఐదు రీచ్‌లను రెవెన్యూ సిబ్బంది మూసివేశారు. పాములపేట, మేడిపల్లి, మల్యాపూర్, జనగామ ఇసుక రీచ్‌లకు వెళ్లకుండా కందకాలు తవ్వారు.

గ్రామ సంఘాలకు శిక్షణ

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్రాంతి మండల సమాఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షులు మౌనిక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో ఏపీఎం లవకుమార్ కొత్త సంఘాల ఏర్పాటుపై శిక్షణ ఇచ్చారు.

పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

పాలకుర్తి,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని,పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవిందర్ డిమాండ్ చేశారు. మంగళవారం బసంత్‌నగర్ రామ్‌మందిరంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) పాలకుర్తి సమావేశంలో మాట్లాడారు.

న్యాయం చేయాలని ఠాణా ఎదుట ఒకరి ఆత్మహత్యాయత్నం

● సివిల్ వివాదంతో మాకు సంబంధం లేదంటున్న ఎన్టీపీసీ ఎస్ఐ

జ్యోతినగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం చేయాలంటూ బోయిని రవి యాదవ్ అనే వ్యక్తి మంగళవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో లారీలు లీజుకు ఇచ్చిన విషయంలో కాంట్రాక్టరు డబ్బులు ఇవ్వడం లేదని, అవి పోలీసులు ఇప్పించాలని రవి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే రవిని గోదావరిఖని ఏరియా ఆసుపత్రి తరలించి కిత్స చేయిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖనికి చెందిన బోయిని రవి ఎన్టీపీసీ ప్రాజెక్టులో ఒక కాంట్రాక్టరుకు వాహనాలు(లారీలు) లీజుకు ఇచ్చే విషయంలో మధ్యవర్తిగా పనిచేశాడు. కొంత మంది లారీ ఓనర్లతో మాట్లాడి సదరు కాంట్రాక్టరు లీజుకు ఇప్పించాడు. ఈ వాహనాలకు రావాల్సిన లీజు సొమ్ము కాంట్రాక్టరు ఇవ్వడం లేదని ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. కొన్ని రోజుల క్రితం రవి ఇచ్చిన ఫిర్యాదు విషయంలో కాంట్రాక్టరు, రవిలను పలిపించి మాట్లాడించారు. సోమవారం గోదావరిఖని చెందిన కొంత మంది లారీ ఓనర్లు తనను లీజు డబ్బు ఇవ్వాలని రవిపై ఒత్తిడి చేశారు. దీంతో మంగళవారం రవి తిరిగి ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఈ సివిల్ వివాదంతో తమకు సంబంధం లేదని గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోనిదని, అక్కడే ఫిర్యాదు చేయాలని తాను చెప్పినట్లు ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ వివరణ ఇచ్చారు. సంఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని, రవి పరుగుల మందు తాగాడా ? బెదిరిస్తున్నాడా ? అనే అంశాలు తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల్లో బీజేపీ తిరంగా యాత్ర

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి నాయకులు తిరంగ యాత్ర నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో చీకురాయిలో ప్రారంభమై భోజన్నపేట, హనుమంతునిపేట, ధర్మాబాద్ ,ముత్తారం ,గౌరెడ్డిపేట ,రాఘవపూర్ మీదుగా పెద్దపల్లి వరకు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, మండల ఉపాధ్యక్షులు సబ్బు మల్లయ్య పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కాలనీలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను పరిశుభ్రం చేసే కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్ర పరిచి పూలమాలలతో నివాళులు అర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆకుల శశి, మూకిరి రాజు, కుమార్‌గౌడ్, మారెపల్లి శ్రీనివాస్, లింగం నాయక్, ఎస్కే పాష, జంజర్ల శ్రీనివాస్, అనిల్ కుమార్, అంకం కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



గాంధీజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్: బీసీల హక్కులను కాపాడడమే బీజేపీ ధ్యేయమని బీజేపీ నాయకుడు జక్కుల నరహరి, గుండబోయిన భూమయ్య అన్నారు. మంగళవారం గోదావరిఖని జీఎం కార్యాలయ మైదానంలో హర్‌ఘర్ తిరంగా యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ విశ్వాస్, శ్యామ్, శివకుమార్, రవి, ఓంకార్, పృథ్వీరాజ్, హర్ష, శ్రీనాథ్, సతీష్ పాల్గొన్నారు.



సింగరేణి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని యాజమాన్యాన్ని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎస్‌టీయూసీ) ప్రధానకార్యదర్శి టి.మణిరాంసింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని టీఎస్‌ఎస్‌యూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్యుల, మందుల కొరత తీవ్రంగా ఉందన్నారు. సింగరేణి సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల్లో 40శాతం వాటాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్లమెంట్ అధ్యక్షుడు ముదిగంటి దామోదర్‌రెడ్డి, పెగడపల్లి రాజనర్సు ఉన్నారు.

జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో సింగరేణి డెస్క్

గోదావరిఖని, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో గల అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆసుపత్రిలో సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్‌ను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, అపోలో ఆసుపత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతరెడ్డి మంగళవారం ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన ఏసీ ఆసుపత్రి విభాగాన్ని కూడా వారు ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఏదైనా అనారోగ్య సమస్యతో ఈ ఆసుపత్రిని సందర్శించినప్పుడు వెంటనే పేరు నమోదు చేసుకొని సంబంధిత వైద్య నిపుణుల వద్దకు వైద్య సేవల కోసం పంపించడానికి, ఈ ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామని, దీనివల్ల సత్వరమే వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ఆసుపత్రి యాజమాన్యం వివరించింది. సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంపై సంస్థ ఛైర్మన్ సంతోషం ప్రకటించారు. ఇక్కడికి రిఫర్ చేయబడిన ఉద్యోగులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంకా డీన్ డాక్టర్. మనోహర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణరెడ్డి, సింగరేణి డిప్యూటీ సీఎంఓ కే బాలకోటయ్య, అపోలో ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ వేజ్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో సింగరేణి డెస్క్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ బలరాం

గనులు, డిపార్ట్‌మెంట్లపై కేఎల్ మహేంద్రకు ఘన నివాళి



కేఎల్ మహేంద్రకు నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



సెంటినరీకాలనీలో నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు పది శాతం లాభాల్లో వాటా హక్కు సాధించిన మహానేత, ప్రపంచ కార్మిక సంఘాల మాజీ అధ్యక్షులు కేఎల్ మహేంద్ర 18వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆర్‌జీ-1 ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్స్, ఓసీపీ-5లలో ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో మహేంద్ర చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జీడీకే2ఏ ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేఎల్ మహేంద్ర జీవితం భారత కార్మిక వర్గ ఆరాట పోరాటాలతో ముడి వేసుకొన్నదని అన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన నాటి నుండి నేటి వరకు సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందని సీతారామయ్య అన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కొన్ని సంఘాలు ఏఐటీయూసీపై అనవసరంగా విమర్శలు చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. సింగరేణి సొమ్మును ఇష్టానుసారంగా వాడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు రూ.35వేల కోట్ల బకాయిలు సింగరేణికి ఇప్పించేందుకు కృషి చేయని ఐఎన్‌టీయూసీ నాయకులు ఏఐటీయూసీపై విమర్శలు చేయడం కాదని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా పలువురు మైనింగ్ స్టాఫ్‌తో పాటు యువ కార్మికులు ఏఐటీయూసీలో చేరగా, వారికి సీతారామయ్య కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ కారంపూరి వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, ఆరెల్లి పోషం, మాదన మహేష్, సంకె అశోక్, రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, బోగ సతీష్ బాబు, మిట్ట శంకర్, గండి ప్రసాద్, సయ్యద్ సోహేల్, ఎంఏ గౌస్ పాల్గొన్నారు.

రామగిరి : సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలోని ఏఐటీయుసి కార్యాలయంలో మంగళవారం కె.ఎల్ మహేంద్ర 18వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన యూనియన్ పక్షాన కార్మికుల హక్కులు సాధించిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ఈ వర్ధంతి సభలో నాయకులు వై.వీరావు, ఎంఆర్‌సి రెడ్డి, జూపాక రాంచందర్, డిటి రావు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితోనే మనుగడ



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన బొగ్గును సకాలంలో వినియోగదారులకు సరఫరా చేయడం వల్లనే సింగరేణి సంస్థ లాభాలు ఆర్జిస్తుందని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. మంగళవారం వకీల్‌పల్లె గనిలో జరిగిన మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశంలో జీఎం మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరగడంతో వినియోగదారులకు ఎక్కువ ధరకు బొగ్గు అమ్మాల్సి వస్తుందని, కానీ ఇతర బొగ్గు సంస్థలు సింగరేణి బొగ్గు కన్నా తక్కువ ధరకు బొగ్గును అందజేస్తుండడం సవాల్‌గా మారిందని జీఎం వెంకటయ్య తెలిపారు. వినియోగదారులను కాపాడుకోవాలంటే తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాల్సిన అవసరం ఉందని జీఎం తెలిపారు. భూగర్భ గనుల్లో ఉద్యోగులు అన్ని డిపార్ట్‌మెంట్‌లలో పనులు చేయడానికి సిద్ధంగా ఉండాలని, పని గంటలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాల్సిన అవసరం ఉన్నట్టు జీఎం వెంకటయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, కంపెనీ లక్ష్యాలు, యంత్రాల వినియోగం గురించి వివరించారు. ఈ సమావేశంలో మల్టీడిపార్ట్‌మెంట్ బృందం సభ్యులు ఎస్వోటూ జీఎం సంతోష్ కుమార్, ఏరియా ఇంజనీర్ సృజన్‌మెహ్రా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం (ఐఈ) మురళీకృష్ణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్ పాల్గొన్నారు.